క్లుప్తంగా

బీఎస్‌ఆర్ నగర్‌లో సీపీఎం జెండా ఆవిష్కరణ


బీఎస్‌ఆర్ నగర్‌లో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్‌లో సీపీఎం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు మహాసభ నిర్వహించారు. 2021 నుంచి మూడేళ్ల పాటు ఏఏ కార్యక్రమాలు చేపట్టారు, ఎలాంటి ఉద్యమాలు చేపట్టారో, ఏఏ సమస్యలను పరిష్కరించారో చర్చించారు. ఇప్పుడు 2024 నుంచి 2027 వరకు చేపట్టబోయే కార్యక్రమాలను చర్చించారు. కార్యక్రమంలో సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు నరేంద్రకుమార్, నాగరాజు, రమణి భారతి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏయూ అనుబంధ కళాశాల విరాళాలు


రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు చెక్కులు అందిస్తున్న అనుబంధ కళాశాల ప్రతినిధులు

మద్దిలపాలెం : విజయవాడ వరద బాధితుల సహాయమందించేందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు ముందుకు వచ్చాయి. కె.కోటపాడులోని అయ్యన్న డిగ్రీ కళాశాల రూ.లక్ష, విశాఖసెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల రూ.80 వేలు, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రూ.లక్ష , విజయనగరంలోని శ్రీ లక్ష్మీ గణపతి కళాశాల రూ.12 వేలు చెక్కులను కళాశాల ప్రతినిధులు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందజేశారు. ఈ చెక్కులను సీఎం సహాయనిధికి పంపనున్నామని రిజిస్ట్రార్ చెప్పారు. కార్యక్రమలో సి.డి.సి. డీన్ ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


మృతుడు మామిడి అప్పన్న

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్కేబీచ్ వద్ద మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. దీన్ని గమనించిన సందర్శకులు బీచ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మురళీనగర్‌కు చెందిన మామిడి అప్పన్నగా గుర్తించారు. మద్యానికి బానిసైన అప్పన్నకు కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగోలేదు. మద్యం తాగేందుకు రెండు రోజులుగా ఆయన భార్య డబ్బులు ఇవ్వలేదు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

బీచ్‌రోడ్డు: రేసపువానిపాలెంలో మనస్తాపంతో ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేసపువానిపాలెంలో ఒంటరిగా నివాసం ఉంటున్న గోవింద్‌రెడ్డి (40) పెయింటర్ పని చేస్తుంటాడు. మంగళవారం ఉదయం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. గోవింద్ రెడ్డిని భార్య విడిచిపెట్టి వెళ్లిపోవడంతో, మనోవేదనతో మద్యానికి బానిసగా మారాడు. దీంతో అనారోగ్యంపాలు కావడంతో, మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

ఫుట్‌పాత్‌పై ఫుడ్ కోర్టులు


ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టులు


రోడ్డుపై నిలిపిన వాహనాలు

- సిరిపురంలో పెరుగుతున్న ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు

బీచ్‌రోడ్డు: పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఫుడ్‌కోర్టులకు అడ్డాగా మారిపోతున్నాయి. దీంతో పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు ఆ ఫుడ్‌కోర్టులకు వచ్చే వారి వాహనాలను రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.
అయినా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

6 నెలల్లో.. పదుల సంఖ్యలో..
సిరిపురం నుంచి రామ్‌నగర్ వెళ్లే మార్గంలో 6 నెలల కిందట ఫుట్‌పాత్‌పై ఒక్క షాపు కూడా లేదు. ఇప్పుడు పదుల సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. దీంతో ఈ మార్గం రద్దీగా మారింది. ఫుడ్‌కోర్టులకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపై పెట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వర్కర్లంతా ఇతర రాష్ట్రాల వారే...
సాధారణంగా పొట్టకూటి కోసం రోడ్డు సైడ్ చిన్న చిన్న షాపులు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఇతర రాష్ట్రాల నుంచి పనివాళ్లను తీసుకొని వచ్చి ఫుడ్‌కోర్టులను నడుపుతున్నారు. ఏ ఒక్క షాపులోనూ యాజమాని పని చేయకపోవటం గమనార్హం. వేలకు వేలు జీతాలు ఇచ్చి మరీ ఫుడ్‌కోర్టులను నడుపుతున్నారని తెలుస్తోంది.

జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం
ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పైగా కొత్త ప్రభుత్వం వచ్చింది, వాటిపై తమకు ఎటువంటి సూచనలు అందలేదని నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్పడం గమనార్హం.

వ్రిందాలో అరుదైన బోన్ క్యాన్సర్ ఇంప్లాంటేషన్


బోన్ క్యాన్సర్ ఇంప్లాంటేషన్ గురించి వివరిస్తున్న వ్రిందా ఆసపత్రి వైద్యులు..

ఆరిలోవ: హెల్త్ సిటీలో వ్రిందా ఆస్పత్రి ఓ వ్యక్తికి అరుదైన బోన్ క్యాన్సర్ ఇంప్లాంటేషన్ చేసినట్లు అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ వింశీధర పుట్రేవ్ తెలిపారు. ఆస్పత్రిలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విజయనగరం జిల్లా రాజాంకు చెందిన 37 ఏళ్ల వై.వెంకట్ కొన్నాళ్లుగా ఎడమ మోకాలు నొప్పితో బాధపడుతున్నాడు. ఆయన వ్రిందా ఆస్పత్రిలో సంప్రదించారన్నారు. ఆయనకు పరీక్షలు నిర్వహించి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించి అరుదైన లింబ్ సాల్వేజ్ సర్జరీ విజయవంతంగా చేశామన్నారు. క్యాన్సర్‌కు గురైన బోన్‌ను తొలగించి దాని స్థానంలో ఇంప్లాంటేషన్ చేశామన్నారు. సర్జరీని ఆరోగ్యశ్రీలో చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంతో ఉన్నారని, కొన్నాళ్లు పాటు కీమోథెరపీ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రేమ్‌నంద్, డాక్టర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం


వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

బీచ్‌రోడ్డు: మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయని, నివారణకు వ్యాయామం చేయాలని ప్రముఖ కార్డియాలజీ మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్ వి సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని కాళికామాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ఇండస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. కోవిడ్ తరువాత గుండె సమస్యలు అధికమయ్యాయని, వ్యాయామం, వాకింగ్ నిత్యం చేయడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్ కుమార్ మహా పాత్రో, హరివదన్ లుక్కా , జాన్ వెస్లీ, ఇండస్ట్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీధర్‌తో పాటు వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయంతో పథకాలు రూపొందించాలి

మద్దిలపాలెం: ప్రజల అభిప్రాయాలతో ప్రభుత్వ పథకాలు రూపొందిస్తే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. ఏయూ ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర 2047 భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 ప్రాముఖ్యతను వివరిస్తూ, పథకాలను ప్రజాసహకారంతో రూపొందించడం వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళికకు సంబంధించిన 12 ప్రధాన రంగాలపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పెరుగుదల, ఆరోగ్య సంరక్షణ, నగరాల అభివృద్ధి, విద్యారంగంలో నైపుణ్యాల పెంపు వంటి అంశాలు ప్రధానంగా చర్చించారు. కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలు రాష్ట్ర ప్రణాళిక విభాగానికి పంపించనున్నారు. కార్యక్రమంలో ఆర్థిక శాస్త్ర విభాగం అధ్యాపకులు, ఇతర విభాగాల ప్రొఫెసర్లు , విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వృద్ధులకు విద్యార్థుల వితరణ


వృద్ధురాలికి పండ్లు అందజేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి విద్యార్థులు గ్రామంలో పలు గృహాలకు వెళ్లి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో మంచాన పట్టిన వృద్ధులను సైతం విద్యార్థులు ఆప్యాయంగా పలకరించి, పండ్లు అందించారు. విద్యార్థుల్లో సేవా భావం కలిగించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం చిరికి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజ, వాణి, విజయప్రభ పాల్గొన్నారు.

ముగిసిన 'బొబ్బిలి వీణ' తయారీ శిక్షణ


శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

దాబాగార్డెన్స్: లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) రెండు నెలలుగా విజయనగరం జిల్లా గొల్లపల్లిలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, బొబ్బిలి వీణ తయారీ శిక్షణ మంగళవారంతో ముగిసింది. లేపాక్షి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం.విశ్వ పలువురు అధికారుల ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫండ్ ద్వారా విశాఖపట్నం లేపాక్షి మేనేజర్ ఎ.కార్తీక్ నేతృత్వంలో ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా లేపాక్షి మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ రెండు నెలల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ఎస్.శంకరాచారి, బి.మురళీ, 20 మంది బృందం మార్కెట్లో డిమాండ్ ఉన్న ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎం.రామలక్ష్మి శిక్షణ పొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వెంకటమురళీ కృష్ణ, 10వ వార్డు కౌన్సిలర్ కె.గోవిందమ్మ, లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

దాబాగార్డెన్స్: బీఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ వేడకలను డాబాగార్డెన్స్‌లో గల బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అంద జేశారు. ఆంధ్రా మెడికల్స్, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పటల్స్, వాసన్ కేర్ హాస్పటల్స్ ద్వారా ఉద్యోగుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున ఉద్యోగులు ర్యాలీ చేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, జైల్ రోడ్డు, జడ్జికోర్టు జంక్షన్, జగదాంబ సెంటర్, సరస్వతీ పార్క్ జంక్షన్ మీదుగా తిరిగి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బీఎస్‌ఎన్‌ఎల్ పీజీఎంటీడీ పాల్ విలియం మాట్లాడుతూ హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్, 4జీ సేవల గురించి వివరించారు. పీజీఎం(ఆపరేషన్స్) ఆడమ్ మాట్లాడుతూ ఎఫ్‌టీటీహెచ్ సేవలు, ఎంఎన్‌పీ బుకింగ్‌ల మెరుగుదల గురించి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు బి. శ్రీనివాసరావు, ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, బి.వి.వి. నగేష్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు గ్రహీతకు అభినందనలు

మద్దిలపాలెం: భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ప్రఖ్యాత సినీ నటుడు మిథున్ చక్రవర్తిని ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ప్రకటించడం అభినందనీయమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పేర్కొంది. ఈసందర్భంగా మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ మెయిల్ చేసినట్టు సొసైటీ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు తెలిపారు.

గాంధీ వేషధారణతో పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న ఎంఎల్‌బీటీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: గాంధీ జయంతిని పురస్కరించుకొని వుడాపార్కు దరి ఎంఎల్‌బీటీ స్కూల్ విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. మంగళవారం వివిధ వేషధారణలతో అలరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. హే రామ్ అంటూ పాదయాత్రలో పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతబూని మహాత్ముడి వేషధారణలతో మెప్పించారు. విద్యార్థుల పాదయాత్రను పాఠశాల ప్రిన్సిపల్ మధురవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహాత్మగాంధీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన ఆలోచనలు, కార్యాచరణలను యువత ఆచరించాలని సూచించారు.

తెలుగునాడు వైద్యవిభాగం నూతన కార్యవర్గం

మద్దిలపాలెం: టీఎన్‌టీయూసీ తెలుగునాడు వైద్య విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడుగా నగేష్ పట్నాయక్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పి.వై.ఎస్.రత్నం , నగర అధ్యక్షుడిగా సేనాపతి రఘు ఎన్నికయ్యారు. జోనల్ కార్యదర్శిగా పి.వి.సత్యానంద్, సహాయ అధ్యక్షుడు బర్రె కుమార్‌లు ఎన్నికయ్యారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్:బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తరించాలి

బీచ్‌రోడ్డు: నారాయణ సేవ పేరుతో వృద్ధాశ్రమం, అనాథాశ్రమం, మానసిక వికలాంగ అభ్యుదయం కోసం స్నేహ సంధ్య సీనియర్ సిటిజన్స్ రిక్రియేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ విశేష సేవలందిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కె.ఆర్.రజనీ అభినందించారు. వారి సేవలను మరింత విస్తరించాలని సూచించారు. స్నేహ సంధ్య 20వ వార్షికోత్సవ సమావేశాన్ని నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమాలకు ఆసరాగా ఉంటూ ఎంతో మందికి సేవలందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ శాఖ ఏడీ మాధవి, స్నేహ సంధ్య అధ్యక్షుడు జగదీష్‌బాబు, కార్యదర్శి రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న జోన్-5లో వాణిజ్య సముదాయాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 పరిధిలో 40 నుంచి 63వ వార్డు వరకు ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు సైడ్ మార్కెట్లకు ఈ నెల 16న జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి.రాము మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 22, 24, 48, 52, 54, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం దుకాణం, 51వ వార్డులో గల మాధవస్వామి కల్యాణమండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణంరోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్‌సైడ్ మార్కెట్, జనతాకాలనీ(బుధవారం) వారం మార్కెట్, కంచరపాలెం రోడ్‌సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్‌సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్‌లకు ఏడాది కాలపరిమితికి అద్దెకు ఇచ్చేందుకు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జీవీఎంసీ నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు జోన్-5 కార్యాలయంలో పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించాలని జోనల్ కమిషనర్ తెలిపారు.

సామాజిక భవనం స్థలం స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..


సామాజిక భవన స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు పెడుతున్న జీవీఎంసీ, రెవెన్యూ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డులో సామాజిక భవనానికి చెందిన స్థలం ఆక్రమణకు సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేశారు. వార్డు పరిధి రవీంద్రనగర్‌లో గ్రామ సంఘం కమిటీ సభ్యులు జీవీఎంసీ సామాజిక భవనానికి చెందిన 200 చదరపు గజాలకు పైగా ఖాళీ స్థలాన్ని కారు చౌకగా రూ.47 లక్షలకు వేరొకరికి అమ్మేశారు. ఇక్కడి ధరలను బట్టి సుమారు రూ 1.40 కోట్లు నుంచి రూ 1.60 కోట్లు ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. దీంతో గ్రామస్తుల సంఘం కమిటీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీనిపై 'కన్నేశారు.. అమ్మేశారు' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు స్పందించారు. మేయర్ జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి సమాజ అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలం విక్రయాన్ని అడ్డుకోవాలని సూచించారు. కమిషనర్ ఆదేశాలతో జీవీఎంసీ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా విక్రయానికి గురైన జీవీఎంసీ సామాజిక భవనం స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సుమారు ఒకటిన్నర కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ స్థలాలను ఎవరు ఆక్రమించవద్దని, ఆక్రమించినవారు ఎంతటి వారైనా కేసులు తప్పవని మేయర్ హరి వెంకటకుమారి హెచ్చరించారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలను దుర్వినియోగం చేయవద్దని సూచించారు.

ప్రజలపై భారం మోపడం తగదు


అధిక ధరలపై మద్దిలపాలెం కూడలిలో సీపీఎం నేతల నిరసన

మద్దిలపాలెం : ఎన్నికల్లో కార్పొరేట్ సంస్థల నుంచి కోట్లరూపాయలు ఎన్నికల బాండ్లు ద్వారా సంపాదించుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు వ్యాపార స్తులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రజల మీద భారం మోపుతున్నాయని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు విమర్శించారు. అధిక ధరలు నియంత్రించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మద్దిలపాలెం బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం సుంకం 20 శాతం పెంచడం వలన వంట నూనె ధర భారీగా పెరిగాయన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ధరలను అదుపు చేస్తామన్న చెప్పిన పార్టీలు అధికారంలోకి వచ్చాక ప్రజల మీద భారం మోపడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ నాయకులు జీవీఎం చలపతి, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు, పి.వెంకట్రావు, ఎం.వి.త్రినాథరావు, సింహాచలం, జె.ఆర్. నాయుడు, ఆర్.శ్రీను, రవి పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వండి


సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు,ఇతర అధికారులు

మహారాణిపేట: అనారోగ్యంలో ఆయా ఆస్పత్రులకు వచ్చే వృద్ధులకు వైద్యులు, సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి ఎక్కువ సేపు ఆస్పత్రిలో నిరిక్షించకుండా వెంటనే వైద్యం అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా అన్ని ఆస్పత్రులలో ఈ విధానం అమలు చేయాలన్నారు. ఆరోగ్య విషయంలో వృద్ధులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు వైద్యశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో పలువురు నోడల్ అధికారులు డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. రామాటాకీస్ దగ్గరలో ఉన్న గోల్డెన్ ఏజ్ ఆశ్రమంలో వద్ధులకు బి. పి, షుగర్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

జూపార్కులో స్వచ్ఛతా హీ సేవ


జూలో స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న కృష్ణా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


సంక్షేమ భవన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఈడీ సత్యపద్మ తదితరులు

మద్దిలపాలెం: కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆదేశాల మేరకు సోమవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత జూ పార్కుగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ బి.భారతి, ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.పద్మిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు పి.ఉమామహేశ్వరరావు , జి.వి. ప్రతాప్, టి.శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ భవన్ ఆవరణలో..
ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని సంక్షేమ భవన్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ భవన్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు భవన సముదాయం పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారం తొలగించడంతో పాటు మొక్కలను సంరక్షించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా కార్యాలయ పరిసరాలను ఉద్యోగులంతా కలిసి శుభ్రపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.సత్యపద్మతో పాటు బీసీ కార్పొరేషన్, బీసీ వెల్ఫేర్ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.